# క్షేమమూ సేమమూ

వాకాటి పాండురంగరావ్

ఢిల్లీలో ఒక పాల సరఫరా పథకం వుంది. కాని అది అందరికీ పాలు సరఫరా చెయ్యదు. ఎంచేత అంటే-సదరు పథకం ప్రభుత్వంవారు నిర్వహిస్తున్నది కావడం వలన-అని చెప్పుకో వచ్చును. మరి ప్రభుత్వంవారు ఏదన్నా ఒక పనిని ప్రజలందరికి సంపూర్ణంగా ఉపయోగపడే విధంగా చేసేస్తే, అన్ని పనులూ ఆ విధంగా ఎందుకు చేయరు, అని ప్రతిపక్షాలవాళ్ళు నిలదీసి అడిగే ప్రమాదం వుంది కదా.

కనుక కేవలం మూడేళ్ళక్రింద మాత్రమే రాజధానీ నగర వాసులలోకి చేరిన మాకు పాల కార్డు లభిస్తుందని ఆశించడం దురాశే అవుతుంది: ఫలితంగా మా ఇంటికి పాలంతా ఒక "గ్వావాలా" (గొల్లవాడు) ఇస్తుండేవాడు.

వాడు ఇస్తుండేవాడు అనడంకన్న, వాడి దగ్గర నుండి మేము తెచ్చుకొనే వాళ్ళం అని చెబితే సరిగా వుంటుంది. ఇందుకు కారణాలు రెండు. అందులో మొదటిది.

మెదట ఆసంత్‌నగర్ పేటలోకి కాపురం పెట్టినసాయంకాలమే నేనువాడిదగ్గరకువెళ్లాను; కాని వాడు నా దగ్గరకు రాలేదు. వాడి దగ్గరకు వెళ్ళి "మహాప్రభో రేపటినుండి పొద్దున్న మూడు పావులూ, సాయంకాలం రెండు పావులూ పాలు కావాలి—" అని కోరితే అతగాడు—"లీటర్ రూపాయ్యిరవై పైసలు; పొద్దున్నా సాయంకాలమూ అయిదున్నర తర్వాత పితుకుతాను!" అని చాల ముక్తసరిగా, ఒక కొత్త ఖాతాదారు వచ్చాడన్న సంతోషం లాటిది రవంతయినాలేకుండా చాలనిర్వికారంగా చెప్పాడు. కనుక పై చేయి ఎవరిదో తెలుస్తూనే వుందిగా... రెండవ కారణం - ప్రతి రోజూ పొద్దున్నేలేచి పాలపాత్రను చేత ధరించి ఆ పాలవాడి కొట్టం దగ్గరకు వెళ్ళి నిల్చుని పాలు పోయించుకు వచ్చేవాడిని. ఇట్లా వెళ్ళడం ఆ యాదవతుల తిలకుడిపట్లగల భక్తి భావం వలన మాత్రంకాదు. నేను ఏ మాత్రం బద్ధకించి, ఇంటికి పాలు పంపమన్నా వాడు పంపేవాడు, కాని మాకొచ్చే పాలల్లో సగం పాలు బద్ధకించేవి; ఆ సగం చోటుని నీళ్ళు ఆక్రమించేవి.

ఇట్లా ఒ పదినెలలు గడిచాయి. మొన్న ఫిబ్రవరి నెలాఖరున ఒక రోజు - ఇంకా చలి కొరుకుతున్న ఉషఃకాలాన పాత్ర తీసుకువెళ్ళి పాలవాడికొట్టులోని టేబుల్‌మీద (అవును: వాడికి టేబులేకాదు, రెండు కొత్త ఇళ్ళున్నాయి! నాకన్న పదేళ్ళముందుగానే వాడింట్లో టెలివిజనూ వుండగలదు!) పెట్టాను. కాని ఆపాటికో ఆ టేబుల్‌మీద ఇత్తడివీ' స్టెయిన్లెస్ స్టీల్‌వీ, అల్యూమినియంవీ కలిసి నానా ఆకారాల పాత్రలున్నాయి. ఆడా మగా జనాభా కలిసి ఓ డజనుమందిదాకా కాచుకుని వున్నారు. నా వంతు వచ్చేసరికి మరొక పావుగంటవుతుంది. పాలవాడు ఒక్కొక్క బర్రెనూ పితికి పాలుపోయాలి మరి.

సరే నని బయటికి వచ్చి రోడ్డుమీద నిల్చున్నాను. కూరలంగడి సర్దార్జీ, బెంగాలీ బాబూ రోడ్డుమీద వాల్చివున్న నులకమంచాన్ని అలంకరించి భారతదేశ విదేశాంగ విధానాన్ని రూపొందించే యత్నంలో వున్నారు, సాల్వార్ కమీజ్‌లు తొడుక్కున్న పొట్టముక్కు పంజాబీ

కుర్రది - బెదురుచూపుల అయ్యర్ మామిని ఆమె "పొంగల్" పండక్కి కొనుక్కున్న పట్టు చీరను గురించి అడుగుతున్నది. మిగతా జనం తలో విషయమూ మాట్లాడుతుంటే ఐక్యరాజ్య సమితి భవనం వరాండాలా వుంది ఆ చోటు.

నేను రోడ్డుమీద కాస్తదూరంగానిల్చున్నాను. ఆ పాటికే ఇంటికి వచ్చిన ఆనాటి దినపత్రికను తెచ్చుకొనుంటే బాగుండేది అనుకుంటూ.


తటాలున నా దృష్టిని ఆకర్షించింది నల్లగా బొద్దుగావున్న ఒక కుక్కపిల్ల. అది రోడ్డు కవతలివైపు - కూర్చొని కాలి వేళ్ళను - అతి శ్రద్ధగా నాలుకతో పాలిష్ చేసుకుంటున్నది. అద్దంముందు కూర్చుని ఆధునిక యువతికూడా తనగోళ్ళపై అంతశ్రద్ధ ప్రకటించదేమో...... ఏ మాత్రమయినా తొందరపడకుండా తాపీగా, ముద్దుగా, గుమ్మటంలా కూర్చుని వున్న ఆ కుక్కపిల్లను చూడగానే ఒకసారి మెత్తటి దాని మెడని దువ్వి, దాన్ని ఎత్తుకుని గుండెలకు హత్తుకోవాలనిపించింది. కాని - జనం చూస్తే ఏమంటారో అని హెచ్చరించింది నా ముప్పైఎనిమిదేళ్ళ వయస్సు.

ఆ కుక్కపిల్ల మెడకు కట్టివున్న జనపదారం గమనిస్తే, అది బహుశా ఏ సెక్రటేరియట్ గుమాస్తాగారింట పెంపుడు కుక్క అయి వుండవచ్చునని అనుకున్నాను. మరి కలవాళ్ళ శునకాలు ఆల్సేషియన్లు డ్రామాంష్లు, పెకినాస్‌లు అయివుండాలి కదా—

ఆ కుక్కపిల్ల నెయిల్ పాలిష్ మానేసి — ఎదుట నిల్చునివున్న మా గుంపుకేసి సీరియస్‌గా చూచింది. ఇందులో ఒక్క మొహమూ దానికి నచ్చలేదల్లే వుంది. కళ్ళు త్రిప్పుకుంది. ఆ ప్రక్కనున్న పెంటకుప్పమీదికి వాలిందొక పిచ్చుక. బ్రహ్మాస్త్రంలా పిచ్చుకమీదికి దూకింది కుక్కపిల్ల. కాని తుర్రుమని ఎగిరిపోయింది పిచ్చుక. తన అపజయానికి ఏమాత్రం తొట్రుపడని "పప్పీ"- (మరి మనిషి పెంచే ప్రతి కుక్కపిల్లకూ ఏదో ఒక పేరు - అందులోనూ ఇంగ్లీషు పేరు వుండితీరాలి కదా) —అచ్చం నియోగి మహారాజులా "క్రింద పడితే పడ్డానుగాని నా మీసాలకు మట్టి అంటలేదుస్మండీ"- అంటున్నట్లు ధీమాగా మీసాలు నాక్కుంటూ కూర్చుంది.

సరిగ్గా అపుడే ఆ ప్రాంతానికి ఒక బక్క పలచటి నల్ల ఆడకుక్క వచ్చింది.

మన దేశపు వీధులలో ఎక్కడయినా కనపడే కుక్క అది. అందరిచేత ఛీ ఛీ అనిపించుకుని తరమబడే కుక్క అది. చెత్తా, గడ్డీ, కాగితాలూ తిని చివరకు ఏ పెంపుడు కుక్క చేతనో కొరకబడి, లేదా ఏ రాత్రివేళ లారీ చక్రం క్రింద పడి నెత్తురు ముద్దగా ముగిసే కుక్క అది.



అదృష్టం వుంటే మునిసిపాలిటీ వాళ్ళ బోనులో లేక్కుకుని, ఏ రూపాయో లైసెన్సు తాను కట్టించిదన్న విషయం తెలియకనే అంతమయ్యే కుక్క అది. విశ్వాసంగలజాతి అని పేరు నందిన జాతికి తాను చెందినదని, తమలో కొందరిని మనుష్యులు ప్రేమిస్తారనీ, పెంచుకుంటారనీ, పెరుగన్నమూ, పలావూ పళ్ళెంలో తెచ్చి ఎదుటపెట్టి బ్రతిమలాడి తినిపిస్తారనీ, గట్టిగా ఈగ కొరికితే ఫోన్ మీద వెటర్నరీ డాక్టరని పిలిపించి మందు వేయిస్తారనీ, ఎండకు వాలుక వేళ్ళాడేసుకుని ఉస్సూరంటూ ఒక చెత్తా డబ్బానుండి-మరొక ఎంగిలాకుల గుట్టమీదకు దాటి చెయ్యనక్కర్లేదని, కారులో కూచుని ఇండియాగేటు, కుతబ్‌మీనార్ వెళ్ళి ఐయిస్‌ఫ్రూట్ తిని, ఆతర్వాత యజమాని బిడ్డలతో బంతి ఆటలు ఆడవచ్చునని తెలియని కుక్క అది. టైగరనీ, సీజరనీ ఎవరూ పిలిచి గారాబం చేయనికుక్క అది. ఎవరూ పెంచని, ప్రేమించని కుక్క అది. దాని పేరు కుక్క... ఇంకేమీకాదు.

అయితేనేం; అది మహారాజులా పీలవుతూ అన్ని వీధులూ తనదిగా తిరిగేస్తుంటుంది. మోటారుకార్లు, ఆఫీసుకెళ్ళేకాళ్ళు పోటీలు పడుతున్న రద్దీ మధ్యలో తానుకూడా ఏదో అర్జంటు పని వున్నట్లు గబగబా ఏటవాలు దిశలో నడిచిపోతూ — ఇష్టం వచ్చినచోట దొరికిన దానిని తిని మురిక్కాలవ నీళ్ళు ఆప్యాయంగా త్రాగి హాయిగా నిద్రపోయి లేచే కుక్క అది. ఎవ్వరికీ అది షేక్‌హాండ్‌లు ఇవ్వనక్కర్లేదు. బంతుల్ని నోట కరుచుకువచ్చి యజమానిని సంతోషపెట్టాల్సిన అవసరం దానికిలేదు. తన బ్రతుకంతా కష్టాలేనన్న విషయం తెలియక సంతృప్తిగా బ్రతికి హఠాత్తుగా చచ్చిపోయే కుక్క అది.

ఆ కుక్క రాకను ముక్కుతోనే పసిగట్టిన పప్పీ తటాలున లేచి నిలుచుంది. దాని అంగుళం పొడవు చెవులూ అటెన్షన్‌లో నిల్చున్నాయి. దాని తోక గురిపెట్టిన తుపాకిలా నిశ్చలంగా వుంది. దేనికయినా తయార్ అని మెరుస్తున్నాయి దాని కళ్ళు. మెక్ మోహన్ రేఖ వద్ద ఎవరో శత్రువు సుమా అని చెప్పింది కాబోలు దాని మెదుల్లా అబ్లాంగాటా.

అయితే కుక్క కళ్ళల్లో ఆ భయము, ఆ కోపము లేనేలేవు. దానిచెవులు కిందకే వేలాడి వున్నాయి. సందేహంతో పలచనయిన సంతోషంతో తోక వుండుండి ఆడుతూంది. అది ముక్కుని కొద్దికొద్దిగా ముందును జాస్తూ పప్పీని సమీపిస్తూంది.

కాని పప్పీ తన పాకిస్తాన్ ధోరణిని వదల్లేదు.

నెమ్మదిగా కుక్క పప్పీ దగ్గరకు చేరి దానిని నాకబోయేసరికి పప్పీ భద్రతామండలికి ఫిర్యాదు చేసినంతపని చేసింది. కెవ్వుమని అరిచి పక్కకు ఎగిరింది.


అప్పుడు కుక్క మరింత నిదానంగా, ఆప్యాయంగా పప్పీ దగ్గిరకు చేరి - "ఇదిగో చూడమ్మా-నేన్నిన్నేమీ చెయ్యను...నువ్వంటే నాకెంత ఇదనుకున్నావ్ - ఊ...నిజంగా నేనమ్మా-" అంటూ గారాలు చెయ్యిబోయింది. కుక్క కళ్ళల్లో ఏమి చూచిందో కాని పప్పీ

వింటే భారతం వినాలి-చదివితే క్వాలిటీ గల పుస్తకాలే చదవాలి. క్వాలిటీగల పుస్తకాలు కావాలంటే
క్వాలిటీ పబ్లిషర్సు వారినేఅడగండి

| | |
|---|---|
| యుగధర్మం | 7-50 |
| మారే లోకం | 4-50 |
| పడగలెత్తిన కాలం | 4-50 |
| నిరుద్యోగి | 4-50 |

ఇందులో మీకోసదుపాయం కూడా వుంది. ఏఒక పుస్తక ...ంచుకున్నా పోస్టేజీ ఉచితం. కాని... కావలసిన పుస్తకాలకు డబ్బు మాత్రం ముందే పంపాలి ... మరచిపోకండి.

క్వాలిటీ పబ్లిషర్సు,
విజయవాడ - 2



మిలిటరీ ధోరణిని మానేసింది; ఖుబ్బోకేషం విప్పి అవతల పారేసింది తన బుల్లితోకను అల్లల్లాడించింది. కుంయ్ కుంయ్‌మని ముచ్చట లాడింది. అంతవరకూ వారిద్దరి మధ్య వాతావరణాన్ని కలుషితం చేసిన అనుమానం. భయం, శత్రుత్వం - ఎగిరి పావల్సింది వెళ్ళి పోయాయి.

పప్పీ తన్ను సరిగా అర్థం చేసుకున్నందుకు కుక్క సంతోషంతో గెంతింది. పప్పీతో ఆట లాడ్డం మొదలెట్టింది. పప్పీకూడా ఫరవాలేదులే అన్నట్లుగా మరీ అంత కలుపుగోరుగా కాక పోయినా మధ్య మధ్య కుక్క ఆడించిన ఆటల్లా ఆడసాగింది. వెనక్కు వెళ్ళి ముందుకు దూసు కొచ్చి కరవబోయినట్లు కుక్క నటిస్తే పప్పీ భయపడినట్లు - అభినయించి వెక్కిలా పడేది. అపుడు కుక్క పప్పీ పొట్టను నాకేది. ఆ అగ క్షణమూ పప్పీ కళ్ళల్లో కిరణాలు - ఏ నాటివో జ్ఞాపకాలను గుర్తుచేసుకోబోయేవి. మరుక్షణం కుక్క గెంతి పారిపోతే పప్పీ కుక్కమీద పడి కరవబోయేది; కుక్క చెవిని పళ్ళసందున పట్టి లాగబోయేది. పప్పీని తప్పించుకుని అనుభవశాలి అయిన కుస్తీవస్తాదులా "ఇదిగో చూడు, నీ శత్రువు నిన్నిట్లా బంధిస్తే ఇదిగో ఇట్లా తప్పించుకుని ఈ పట్టుతో లొంగదీయాలి" అన్నట్లుగా పప్పీని సుతా రంగా కిందపడేసి, దానికేమీ గాయం తగల కుండా పాఠంనేర్పేది. పప్పీకిదంతా క్రొత్త ప్రపంచం. అయితే మధ్య మధ్య — భయంక రంగా కనుపించే కుక్కనోటిలోని పళ్ళను చూచినప్పుడూ, కాస్తవేగంగా కుక్క తన్ను కిందకు పడేసినప్పుడూ పప్పీలో పాత భయం అనుమానం మొలకెత్తి, గుర్రమనేది— ఆక్షణం కుక్క తాను కాస్త అతిగా ప్రవర్తించా లని తెలుసుకుని పశ్చాత్తాప పడుతున్నట్లు ముందుకు కాళ్ళుసాచి కూలబడితే పప్పీ లేచి నిల్చుని. పెద్దగా పోజుపెట్టి-"ఇహ నెప్పుడూ ఇట్లా చెయ్యకు షో" అని కోప్పడినట్లు చేసేది.

హఠాత్తుగా నేను ఆ రెంటి మధ్య పోలిక ఉన్నట్లు గమనించాను. కుక్కయొక్క నల్లటి మొహంమీద ముక్కునుండి పైకి, చెవులమధ్య దాక ఎవరో దిద్దినట్లు తెల్లటి గీతవుంది. పప్పీ నల్లటి మొహంమీదా అలాంటిదే తెల్లగీతవుంది. రెండింటి తోకలూ నల్లగావున్నా. తోకలమధ్య భాగం తెల్లగా సున్నం పూసినట్లుంది.

అప్పుడు స్ఫురించింది నాకు - బహుశ ఆ రెండింటిమధ్య వున్నది కేవలం మైత్రీభావం మాత్రమే కాదని.

పెద్దగా అరిచింది పప్పీ. మళ్ళీ అరిచింది.

ఆటలపిచ్చిలోపడి పళ్ళతో పప్పీ మెళ్ళోని దారాన్ని లాగింది కుక్క. ఆ దారం కుక్క పళ్ళసందున ఇరుక్కుండి పోయింది కాబోలు ఓ సెకెండుసేపు.

పప్పీకి భయం వేసింది - తన పీక ఏదో - అయిపోతున్నట్లు అంతవరకూ నెరపిన దోస్తీ నంతా మరచిపోయి భయంతో బావురుమని అరిచింది.

దాని అరుపులు విని ఆ ఎదుటి వరసలోని పెంకుటింటి తలుపులు తెరుచుకున్నాయి. పదిహేనేళ్ళ పంజాబీ పడుచు గబగబా బయటికి వచ్చి చిన్నారి పప్పీని "రాక్షసి" కుక్కనుండి రక్షించి, ఎత్తుకుని, గుండెలకదుముకుని "మా నాన్నే, మా చిట్టే, మా బాబే," అని లాలిస్తూ—అంతవరకూ వున్న వెలుగుచోట శూన్యత ఆక్రమించిన కళ్ళలో ఎదురుగా చూస్తున్న కుక్కమీదకొక్కరాయి విసిరింది. అది తప్పించుకుని నాలుగ్గజాలవతలకు వెళ్ళి—పప్పీ వైపే చూస్తున్న కుక్క కళ్ళల్లో అపుడే ఉదయిస్తున్న సూర్యుడి కిరణం తడి తడిగా తళుక్కుమంది.

ఆ అమ్మాయి ఇంకోరాయి తీసివిసిరే సరికి అది కుక్క ముందరి కాలుమీద పడింది. అది బాధతో కుయ్యో మొర్రో మంటూ వీధి చివరకు వెళ్ళి నిల్చుని వెనక్కు తిరిగి పప్పీకేసి - "పిచ్చి తల్లీ - నేను నీకు హాని కల్గిస్తానా - నన్ను నీకు తెలియదా", అన్నట్లుగా చూసింది.

కాని పప్పీ మాత్రం ఆ అమ్మాయి చేతుల లోనే కూచుని-"చూచావా, నాకోమనిషీ, ఇల్లూ వున్నాయి. నేను నీలా అల్లాటప్పాగా తిరిగే రకం కాదు." అంటున్నట్లుగా ధైర్యంగా, ధీమాగా, హుందాగా, గర్వంగా, గొప్పగా, ఇంకా ఏవేవేవిటోగా చూచింది. బడాయిగా ఆ అమ్మాయి మొహం నాకి చూపించింది.

పప్పీని ముద్దులాడుతూ ఆ పంజాబీ పిల్ల ఇంట్లోకి వెళ్ళిపోయే ముందు నాకు పప్పీ మెడకు కట్టిన జనుపదారం ఒక్కటే కనుపించింది. పప్పీ బహుశా అద్దంలో చూచుకోదు కాబోలు; లేక చూచినా...

"బాబుజీ" అన్న కేక నన్ను పాలవాడి కొట్టంలోకి లాక్కెళ్ళింది.

అరె! ఆ సర్దార్జీ, అయ్యర్ మామి, సొట్ట ముక్కు గుంటదీ - అందరూ వెళ్ళిపోయారు.

పాలతో నిండిన పాత్రను అందించాడు పాలవాడు. అది తీసుకున్నాను. వీధి చివరనే నిల్చుని పప్పీవున్న ఇంటి తలుపులకేసి చూస్తున్న కుక్కని వెనుదిరిగి చూస్తూచూస్తూ ఇల్లు చేరాను.

పాలపాత్ర మా ఆవిడ చేతికిచ్చి దిన పత్రికలో లీనమయ్యాను.

పది నిముషాల తర్వాత కాఫీని అందిస్తూ మా ఆవిడ అడిగింది - "ఇవాళ వాడు పాలు పితుకుతుండగా మీరు చూడలేదా ఏమిటీ?"

"చూశానే - ఏం?"

"నేడు పాలు పెచ్చి నీళ్ళు."

"అదేవిటీ! నేనక్కడ నిల్చుని పితికించుకొస్తేనూ-"

"హయ్యో రామ! పాలేదో నీళ్ళేదో మీకు తెలుసా ఏమన్నానా" అంది ఇల్లాలు.

మరి సరదాగా అన్నదో సీరియస్‌గానే అన్నదో తెలియలేదు నాకు.

కాని ఆరోజు ఆఫీసుకు వెళ్తూ బస్సులో వందాపాతికమంది మధ్య ఇరుక్కుపోయి ఒంటి పాదంమీద నిల్చుని ఇంకో పాదాన్ని ఎక్కడ మోపడమా అని సతమతమవుతుండగా తటాలున అనిపించింది మాఆవిడ రిమార్కు పప్పీకి వర్తిస్తుందేమో నని!